# గొడుగు దొంగ

నారాయణబాబు పన్నెండు రూపాయలు పెట్టి, అసలు బుట్ట మార్కు గొడుగు కొన్న తర్వాత, మూడు వరుసలు పెద్ద పెట్టున వానలు వచ్చి పడ్డాయి. పాపం ఒకసారి కూడా తన గొడుగు క్రింద తాను నిలబడలేక పోయాడు. వానధార చూసుకుంటూ కంటి వెంబడి నీళ్ళు కార్చుకుంటాడు. ఇట్టే చివాలున గొడుగు విప్పి చటుక్కున బజారు వెళ్ళాలని ఉబలాటపడే తన మనస్సు, వాన చినుకులకు భయపడి, వరండాలో ముద్దయి కూర్చుని వుంది. పెద్ద అవసరం వస్తేనేకాని గుమ్మం కదలడు. చీటికీ మాటికీ బజారు పోవాలంటే ప్రాణ సంకటం.

"రాణీ, ఓ సంచీ ఇటు పడెయ్యి. అదిగో వంకెకు తగిలించిన గొడుగు ఇటు తీసుకురా" అంటూ ఉండేవాడు ధీమాగా. ఇప్పుడు వంకెమీద ఏముంది? తన చిరిగిపోయిన కోటు ముసలి తోలులాగా వేలాడుతూ వుంది. వాన వస్తోందంటే సరి, దుఃఖము ముంచుకు వస్తూ వుంటుంది. అబ్బ! దాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకునేవాడు! అది వానకు తడుస్తూ వుంటే, తాను లోపల వణుకుతూ వుండేవాడు. ఇంటికి రాగానే బట్టలు పిండినట్లు పిండి ఆరేసేవాడు. తువ్వాలపెట్టి శుభ్రంగా తుడిచేశేవాడు "గొడుగు గుడ్డ తుడిచే నిక్షేపరాయుణ్ణి నిన్ను తప్ప ఇంకెవర్నీ చూడలేదురా" అని వాళ్ళ మేన మామ ఎగతాళి చేస్తున్నా కూడా, "గొడుగు విలువ ఆయనకు తెలీదులే" అనుకునేవాడు. అంత

ప్రాణ ప్రదంగా చూసుకుంటూన్న గొడుగును కొనటానికి అతను పడ్డ అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. క్రిందటి వర్షకాలంలో చిత్తుగా తడిసి ఇంటికి వచ్చేటప్పటికి, జలుబు ధారంచేసి రెండు రోజులు మంచం పట్టాడు. ఆ దెబ్బతో ఓ గొడుగు కొనాలనే అభిప్రాయం చిటుక్కున కలిగింది. రాణి దానికి వంతపాడింది. అప్పటికి వర్షాకాలం చివరి ఘట్టంలో ప్రవేశించింది. అందుకని తటపటాయించాడు. "ఈసారి మళ్ళీ ఆ రోజులకు ముందర కొనేస్తే సరేలే" అని సమాధానపడ్డాడు. "ఆదీగాక పన్నెండు రూపాయలు ఒక్కసారి పెట్టలేను. కొంటే మంచి రకం కొనాలి, లేకపోతే మెదలకండా వూరుకోవాలని" అతని ఉద్దేశం. అసలు ఈ పన్నెండు రూపాయలకు ఎంత రభసయింది!

రాణీతో పెద్ద పోట్లాట పెట్టుకున్నాడు! ఆమెగారి తరఫు ఒక బంధువు విచ్చేసింది ఓనాడు హఠాత్తుగా. నారాయణబాబు పై ప్రాణాలు పైనే ఎగిరిపోయినాయి. ఇంటికి చుట్టంవస్తే, చెయ్యాలసిన గౌరవ మర్యాదలు అటుంచి, ఆమెగారు ఎప్పుడు వెళ్ళిపోతుందా అని శత విధాల ప్రయత్నం చేశాడు. ఇంచుమించు ఊదర పెట్టేశాడు. దాంతో "మా వైపువాళ్ళు ఎవరొచ్చినా, మీరు సహించలేరు. మీ వాళ్ళు ఎంతమంది వచ్చి మేసిపోతున్నా అజాపజా వుండదు" అంటూ రాణీగారు గీతం ఆలాపించింది. పెళ్ళయినప్పటినుంచి ఎవరి వైపు వాళ్ళు ఎంతెంతమంది ఎప్పుడెప్పుడు వచ్చారో జమా ఖర్చులు చూసుకున్నారు. ఇంతకీ ఆమెగారు ఇంకా నాలుగు రోజులపాటు వుంటే, తాను గొడుగు కోసం వేసుకున్న బడ్జెటు తల క్రిందులయి పోతుందిట. ఒకటేమిటి! ఇలాంటివి తమాషాగా, నాటకంలో పాత్రయిలాగా ఇట్టేవచ్చి, రాణి, నారాయణబాబుల మధ్య తుఫాను లేవదీసి చక్కా పోతూ వుండేవి.

ఎట్లాగయితే ఈసారి వర్షకాలం వచ్చే వేళకి గొడుగు కొనాలనుకున్నాడు. కొనేశాడు. గొడుగుకొని ఇంటికి తీసుకు రాగానే, సావిట్లోకి వచ్చేసి అమాంతం తెరిచాడు. గోవర్ధనగిరిక్రింద గోపికా స్త్రీ వచ్చినట్లు రాణీ కులుక్కుంటూ వచ్చి భర్త ప్రక్కన నిలబడింది. చిట్టీ,పొట్టీ, బుల్లాడు, పెద్దపాప వచ్చేసి చుట్టూ మూగారు. అబ్బ! ఎంత ప్రశాంతంగా వుంది. తన గొడుగునీడ క్రింద ఇంతమంది ఉన్నారన్న మాట అనుకున్నాడు! ఫొటో తీయించుకుని, శాశ్వతంగా గోడకు వ్రేలాడకట్టాలని ఊహపడ్డాడు, లోకానికి వెరిచి, ఇతరులు వేసే కుంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలసివస్తుందని భయపడి, తన కోరికను తనమనస్సులోనే భద్రపరచుకున్నాడు.

మొట్టమొదటిసారిగా, నెమలిపింఛం విప్పినట్లు గొడుగు అమాంతం విప్పి, వానలో అడుగుపెట్టాడు. వాన చినుకులు టపటపమని గొడుగు మీద పడుతుంటే అతని సంతోషానికి అంతులేదు. ముత్యాలులాగ నీటి చుక్కలు గొడుగుమీద పడి క్రిందకు జారిపోతుంటే విడ్డూరంగా చూసుకున్నాడు. కాని అట్లా వానలో అస్తమానం వెళ్లుతూవుంటే గొడుగు తడిసి పోతుందేమో అని జంకుతూ నడుస్తున్నాడు.

వెళ్ళీ వెళ్ళీ ఓ షాపులో నిలబడి పోయాడు. ఇతకీ దానికి మల్లుగుడ్డ కొని కుట్టించాలని, తడిసి పోకుండా! అసకు ఆ గొడుగు పరిధి ఎంత ? ఏంతగుడ్డ కావలసి వస్తుంది అని లెక్కలు వేస్తున్నాడు. షాపు యజమానితో బేరం ఆడుతున్నాడు! అంతే! "అదిగో అది కావాలి" అని కొంచం ముందుకు వెళ్ళి తెల్లటి మల్లు బట్ట చూపెట్టాడు. తనకు, గొడుక్కు ఉన్న దూరం గజం, రెండు గజాలదాకా పోయింది. అంతే ఆ దూరం అంతులేని దూరంగా ఇట్టే పోయింది? ఇట్టే వెనక్కు తిరిగి చూసుకునే టప్పటికి, గొడుగు లేదు! బాణంలాగ రివ్వున బజార్లో కాలు

పెట్టాడు. ఒకతను మహావేగంగా పరుగెత్తుకు పోతున్నాడు. తాను చూస్తుండగానే సందు మళ్ళాడు. నారాయణబాబు కాళ్ళు అరిగేటట్లు సందులు గొందులు తిరిగేశాడు. గొడుగున్న ప్రతి మనిషిని నిలవేశాడు! అనుమానం వున్న ప్రతి వ్యక్తిని ఆపేశాడు. తన అదుర్దా ఇతరులు పంచుకోలేదని చిరాకుపడ్డాడు. తిట్టాడు. తిట్టుకున్నాడు.

రెండు చేతులూ వెనక్కి పెట్టుకుని, ఘోరమైన నేరం చేసిన వాడులాగ అడుగుల్లో అడుగులు వేసుకుంటూ తల వంచుకుని ఇంటికి వచ్చేశాడు.

ఉన్నపళంగానే, "గొడుగేదండి!'' అన్నది రాణి. నారాయణబాబు దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. రెండు చేతులూ ఉట్టివి తెరచి చూపించాడు. ఆమె ఆశ్చర్యపోయింది. గొడుగు ఎత్తుకుపోయిన వాణ్ణి నోటికి వచ్చిన దండకాలతో స్తోత్రం చేశేసాడు. ఆ ఉద్రేకం, ఆ అహంకారం చూస్తుంటే నిజంగా ఆ దొంగే కనక కపిస్తే ఏంచేసి వుంటాడో అని పించింది.

వానాకాలం యింకా పూర్తిగా ప్రారంభం కాలేదు. అడపాదడపా చినుకులు పడుతున్నాయి, అంతే! అసలు గొడుగు ఉపయోగం అంతా యింకా ముందుంది. మొదట్లోనే తన ఆశ తునిగిపోయింది. ఇంకా వర్షంలో పోవాలంటే నెత్తిన గుడ్డేసుకుని వెళ్లాలిసిందే, చెడ్డ ఉక్రోషం వచ్చేస్తోంది. ఎట్లాగయినా కాని, ఆ గొడుగు ఎత్తుకుపోయినవాణ్ణి పట్టుకోవాలనీ వాణ్ణి దుంప తెంచేసెయ్యాలనీ, నారాయణబాబు పట్టుదల. తాను ఏంతో కష్టపడి, నలుగుర్లోనూ చెడవాడనిపించుకుని గొడుగు కొన్నాడు. ఎంతో ప్రాణప్రదంగా చూసుకున్నాడు. చివరకు తన గొడుకు తనకు కాకుండా పోయింది. తీవ్రంగా వ్యధపడి పోతున్నాడు. ఇంత దుర్భరమైన బాధ తానెప్పుడు ఇంతకు ముందు అనుభవించి వుండలేదు. తన

సొమ్మును అన్యాయంగా, దుర్మార్గంగా కాజేసినవాడు ముందుకుపోడు అని శపించాడు. అతనికి తగిన శాస్తి భగవంతుడు చేసితీరుతాడని తన మనస్సుకు నమ్మకం కలిగించుకున్నాడు. ఎంత సమాధానపడ్డా, తన వస్తువు తన దగ్గర లేకుండా పోయింది. ఎప్పుడు బజార్లోకి వెళ్ళినా, గొడుగుల మనుష్యుల్ని ఓకంట కనిపెడుతూనేవున్నాడు. తన దృష్టి లోంచి వాళ్ళు తప్పించుకపోకుండా జాగ్రత్త పడుతూనే వున్నాడు. చెదురువాటుగా ఎవరైనా అడ్డదోవ తొక్కేడా, వాని వెంట పడకుండా వుండనూలేడు. ఎతుకపోయినవాడు ఎదురుగుండా వస్తాడా! వాడి జాగ్ర త్తలో వాడూ వుంటాడు. ప్రాణం విసిగి పోతోంది. తన గొడుగు పోయి నప్పటినుంచి ఎన్నివందల గొడుగులు తనిఖీ చేసివుటాడో! నిశాశ పూర్తిగా ఆవహించింది. ఇక తన గొడుగు తనకు దొరకదూ అనే నిశ్చ యానికి వచ్చేశాడు! దొంగను పట్టే ప్రయత్నం యించుమించు విర మించుకున్నట్లే!

అయితే వానలు మాత్రం, అదేంశాపమో, మహా జోరుగా పడు తున్నాయి. ఎడతెరిపి లేకుండా వున్నాయి. ప్రతిరోజూ నారాయణబాబు స్నానంచేసి ఇంటికి రావలసిందే! "ఇట్లా దిగులుపడి వూరుకుంటే ఎట్లా గండి! మళ్ళీ జలుబుభారం చేసిందంటే మళ్ళీ కష్టం. ఇంకొక గొడుగు కొనుక్కోండి'' అంటూ రాణి సలహాలు ఇవ్వటం మొదలుపెట్టింది.

"ఆ ఘడియ వచ్చినపుడు. నువ్వు చెప్పాలిసిన అవసరమే వుండదు." అని మెదలకుండా వూరుకుంటున్నాడు. ఓనాడు సాయంత్రం ఆఫీసువదిలిపెట్టిన తర్వాత వర్షం ప్రారంభమయింది. వచ్చీరావడమే మహాప్రళయంగా వచ్చేసింది. అప్పటికీ ఈ సూచన కనిపెట్టే పెంద రాళే ఇంటికి చేరుకుందామని నారాయణబాబు ముందుగానే బయలుదేరాడు తీరా మధ్యలో యిరుక్కునిపోయాడు. అందులోనూ ఓ చిన్న షాపులో

అప్పటికే యిద్దరు వొదిగి వొదిగి నిలబడి వున్నారు. ఓమూల చూరు నీళ్ళు మాడుమీద పడి, మొహంమీదగుండా దారిచేసుకుని క్రిందకు ధారాళంగా వెళ్ళిపోతున్నాయి. ఎట్లాగో తడిశాంగదా అని అందులో ఒకతను నడిరోడ్డుమీద పడ్డాడు. ఇంకొంచంలోపలికి చోటు దొరికిందన్న మాట. ఈ మధ్యలో వాన తగ్గినట్టేతగ్గి, మళ్ళీ ఫెళఫెళమంది. ఏమను కున్నాడో ఏమో నారాయణబాబు "అవుతే, పూర్తిగా వాన తగ్గిన తర్వాతే ఇంటికి వెళదాంలే'' అని తాపీగా చతికిలపడ్డాడు. షాపుయజమాని ఏమీ తోచక "అబ్బా చాలా పెద్ద వర్షమండీ! కాఫీ తెమ్మని పంపేను కుర్రాణ్ణి ఇంకా వాడు తెచ్చేదేముంది! నేను తాగేదేముంది'' అను కున్నాడు.

"అవునవును చాలా పెద్ద వర్షం'' అన్నాడు నారాయణబాబు. ఆ మాటలూ ఈ మాటలూ నిరాఘాటంగా దొర్లిపోతున్నాయి. ఆ కాస్త కాల వ్యవధి లోనూ ఇద్దరూ యెంతో సన్నిహితంగా వచ్చినట్లు అనిపించింది వాన కురిసి కురిసి అలసి వెలిసిపోయింది.

"వెళ్ళొస్తానండీ'' అన్నాడు.

"మరి మీ గొడుగు" అన్నాడు ఆ షాపు యజమాని, హఠాత్తుగా. 'ఆ !....ఇట్టే వెనుక్కి తిరిగాడు.

"అవును....అవును....గొడుగు...." నారాయణబాబు గుండె దడ దడ కొట్టుకోవటం మొదలుపెట్టింది. కుడి చెయ్యి చాలా పొడువు సాగింది. వణుక్కుంటూ గొడుగును పట్టుకున్నాడు.

"అట్లా చూస్తారేమిటి!...." అన్నాడు ఆ యజమాని.

"అబ్బే! ఏంలేదు! .... ఏంలేదు! ...." అంటూనే "ఇది నా గొడుగు" అని గొంతులోనే సణుకున్నాడు.

చకచక సాగిపోతున్నాడు. మళ్ళీ వెనక్కు చూస్తున్నాడు, గాబరా పడుతున్నాడు.

కొంచెం దూరంలో ఆదుర్దాగా వస్తున్న ఓ వ్యక్తిని పసికట్టి పోల్చుకున్నాడు. అతను ఇందాక తన ప్రక్కన నిలబడ్డ మనిషే!

నారాయణబాబుకు గుండె ఆగినంత పనయింది. అతని కంటికి కనబడకుండా చరచరా సిమెంటు రోడ్డుమీద పరుగెత్తాడు.

ఇంటికి వచ్చీరావటంకోనే. రాణి ఎదురుగా వచ్చింది.

"అమ్మయ్య! ఇవ్వాల్టికి కొన్నారన్నమాట గొడుగు! ఇంత సేపు చేశారేమిటి! కొన్న తర్వాత గొడుగు విప్పనన్నా విప్పారా! ఏదీ ఇటివ్వండి! ఎంతకు కొన్నారండి! పోయిన దానికంటే ఇదే బాగుంది! అయ్యోరామ! మాట్లాడరె."

నారాయణబాబు బరువుగా వచ్చి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

"దేవుడనేవాడున్నాడు! మనకు అన్యాయం చెయ్యడు. మన గొడుగు మనకు ఇప్పించాడు....రాణీ....ఈ గొడుగు మనదే...." ఎంతో ఆవేశంగా అన్నాడు.

( పుస్తక ప్రపంచం, జూన్ 1961 )